నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి



బాగ్‌అంబర్‌పేటలోని ఎస్‌బీఐకాలనీ పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో రూ.78 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.బతుకమ్మకుంటలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్‌బీహెచ్‌కాలనీ పార్క్ ఆధునీకరణకు రూ.42 లక్షలు, రూ.6లక్షలతో మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టానని అన్నారు. మౌలిక సమస్యల పరిష్కారానికి శాస్వత ప్రతిపాదికన పనులు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పార్కులు, రోడ్లు, పైపులైన్ వ్యవస్థ ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు.

◆ నాణ్యత ప్రమాణాలు పాటించి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని కోరారు. స్థానికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వర్తించాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్ పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీధర్, డీజీఎం విష్ణువర్ధన్‌రావు, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత, నాయకులు వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, గెల్వయ్య, అరుణ్‌కుమార్‌రెడ్డి, మీరియాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పఠాన్ బస్తీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలో లోప్రెషర్, కలుషితనీటి సరఫరా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు జావిద్‌ఖాన్ ఆధ్వర్యంలో పఠాన్‌బస్తీలోని ప్రధాన మసీదు వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలపై ఆయనకు ఫిర్యాదు చేయడంతో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే మంచినీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయో ఆ వీధిలో కొత్త పైపులైన్‌లు వేయాలన్నారు. మంజూరైన మంచినీటి పైపులైన్‌లను ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్‌హౌస్ శ్రీనివాస్, షకీల్, జాఫర్, బల్వంత్ తదితరులు పాల్గొన్నారు.



పఠాన్‌బస్తీలో అధికారులతో చర్చిస్తున్న ముఠా జైసింహ

కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన రిషి విద్యార్థులు



విజేతలైన విద్యార్థులతో రిషి పాఠశాల కరస్పాండెంట్ శ్యామల, ఉపాధ్యాయులు

అంబర్‌పేట: అండర్-14 బాలుర కబడ్డీ పోటీల్లో ప్రేమ్‌నగర్‌కు చెందిన రిషి పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మొదటి బహుమతి గెలుచుకుని విజేతలుగా నిలిచారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ పరిధిలో రిషి పాఠశాల విద్యార్థులు కబడ్డీలో ఉత్తమ ఆటతీరును కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. దీంతో గురువారం పాఠశాల అవరణలో పాఠశాల కరస్పాండెంట్ శ్యామల, ఇతర ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ఆహూతులను ఆకట్టుకున్న దివ్యాంగులు

డీడీవీటీఆర్‌సీ ఉత్సాహంగా టీచర్స్ డే

నల్లకుంట: విద్యానగర్‌లోని డీడీహెచ్ రీసెర్చ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ వొకేషనల్‌ట్రైనింగ్, రిహాబిలిటేషన్ సెంటర్ (డీడీవీటీఆర్‌సీ) టీచర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి హాజరైన డీడీవీటీఆర్‌సీ చైర్ పర్సన్ ఉషారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.





వేడుకల్లో డీడీవీటీఆర్‌సీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంధకారం

• పలు బస్తీలు, కాలనీల్లో వెలగని వీధి దీపాలు
• ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



పూల్‌బాగ్‌లో కూలడానికి సిద్ధంగా స్తంభం

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో జీహెచ్‌ఎంసీ వీధి దీపాల విభాగానికి ఇటీవల కాలంలో ఫిర్యాదులు అధికమయ్యాయి. తమ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రిపూట తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పలు కాలనీల నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పగటి పూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయనే ఫిర్యాదులు సైతం ఉంటున్నాయి. వీటిపై జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించడం లేదని పలు కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ కవాడిగూడ, భోలక్‌పూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రాత్రి పూట వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి అరవింద్ నగర్ మార్గంలో కాలంగా వీధి దీపాలులు వెలగడం లేదు. బస్సులు, మెట్రో రైలు దిగి ఈ మార్గంలో రాత్రి పూట ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ వీధి దీపాలను పునరుద్ధరించాలని స్థానికులతో ఫిర్యాదు చేస్తున్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులకు, బస్తీ, కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నా ఫలితం లేదు.

ఎక్కడెక్కడ సమస్య ఉందంటే...

◆ పూల్‌బాగ్ నుంచి తాళ్లా బస్తీ వెళ్లే ప్రధాన మార్గంలోబస్తీలో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రి పూట అంధకారం నెలకొంటోంది.

పలు చోట్ల పగటిపూట వెలుగుతూ...

◆ అనేక ప్రాంతాల్లో రాత్రిపూట వీధి దీపాలు వెలగక పోవడం సమస్యగా మారగా... మరికొన్ని చోట్ల పగటిపూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ సమస్య అధికంగా ఉంది. ఈశ్వరమ్మ బాడా, డీఎస్‌నగర్, బండ మైసమ్మ నగర్ పరిసర ప్రాంతాల్లో కూడా పగటి పూట వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తే టమైర్లు చెడిపోయాయని సమాధానమిచ్చి మిన్నకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ **త్వరలో సమస్యను పరిష్కరిస్తాం: డీఈ**
ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని వీధి దీపాల విభాగం అధికారి తెలిపారు. వీధి దీపాల నిర్వహణలో సమస్యలు ఉన్నాయన్న విషయం వాస్తవమేనని అన్నారు. ఈ సమస్యలను పది రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఇందిరాపార్కు చౌరస్తా నుంచి దోమలగూడ వెళ్లే ప్రధాన రోడ్డులో అలంకారప్రాయంగా వీధి దీపాలు

ఆరు నెలలుగా...



వీధి దీపాలు వెలగడం లేదని సంబంధిత అధికారులకు ఆరు నెలలుగా ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.
– రాకేష్, హెచ్‌బీకాలనీ

పట్టించుకోవడం లేదు



బోనాల పండగ నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. అప్పటి నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నానే ఉన్నాం. గణేశ్ పండుగ కూడా అయిపోతుంది. అయినా పట్టించుకోవడం లేదు. కనీసం గణేశ్ నిమజ్జన ఊరేగింపులో లోపైనా మరమ్మతులు చేయాలి.
– ఓం ప్రకాష్, పూల్‌బాగ్

ఉత్తమ అధ్యాపకులు వీరే...

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు లెక్చరర్స్‌కు ఉత్తమ అధ్యాపకుల అవార్డులు వరించింది. అందులో అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ బోటనీ ఓ.పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ గుండు మల్లికార్జున్‌లు ఈ అవార్డులు పొందిన వారిలో ఉన్నారు. వీరు సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంచే అవార్డులను స్వీకరించనున్నారు.

కేవీకే హైస్కూల్ నుంచి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాగ్ లింగంపల్లిలోని కేవీకే హైస్కూల్‌లో చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న లోలకపూరి నరేందర్ ఎంపికయ్యారు. 23 సంవత్సరాలుగా చిత్రలేఖనంలో గొప్ప కళాకారుడిగా రానిస్తున్నారు.

గౌరీభట్ల లక్ష్మణామూర్తి దంపతులకు సత్కారం

నల్లకుంట: ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి 'సంగీత రత్న'అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా శ్రీసాయిశృతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు గురువారం గౌరీభట్ల దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి, వర్ధమాన గాయినీమణులు, ఈవెంట్ మేనేజర్లు నందిని, యామిని పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో టెలికాం సేవల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కంట్రోలర్ జనరల్ వందనాగుప్తా

చిక్కడపల్లి: గ్రామీణ ప్రాంతాలలో టెలికాం సేవల అభివృద్ధికి భారత సమాచార మంత్రిత్వ శాఖ విశేషంగా కృషి చేస్తోందని పోస్టల్, టెలికాం అకౌంట్స్, ఫైనాన్స్ సర్వీసెస్ కంట్రోలర్ జనరల్ వందనాగుప్తా అన్నారు. గురువారం చిక్కడపల్లి రాష్ట్ర సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో జరిగిన సెంట్రల్ జోన్ సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందనాగుప్తా మాట్లాడుతూ.. టెలీ ఎడ్యుకేషన్, హెల్త్ వంటి సేవలకు సబ్సిడీ అందిస్తుందని అన్నారు. ఈ 2024-25 సంవత్సరానికి సెంట్రల్ జోన్ పరిధిలోని 5 సర్కిళ్ల నుంచి రూ.41.49.27 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.99.12 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.82.9 కోట్లు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ సేవలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా సర్కిళ్ల కంట్రోలర్లు సైతం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ పోస్టల్, టెలికాం అకౌంట్స్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ కంట్రోలర్ అశోక్‌కుమార్, ఉన్నతాధికారి ఆశీష్‌జోషి, జోన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిపారవశ్యం.. శ్రీగణపతి హోమం

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని శ్రీఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నాగదేవతా ఆలయ నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాత్రిక్ నాగేందర్ బాబ్జీ చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆలయంలో శ్రీగణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ముఖద్వారంపై నూతనంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వాసు, భీష్మదేవ్, ఓంప్రకాష్ యాదవ్, డా. శిరీష, సి.నందకిషోర్, రమేష్, శీర్ సాగర్, ఎస్ఎస్ రాము, రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చెప్పల్‌బజార్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

7న 'లైఫ్ మేనేజ్‌మెంట్'పై ప్రసంగం

కాచిగూడ: హిమాలయ ధ్యాన యోగం ఆధ్వర్యంలో 'లైఫ్ మేనేజ్‌మెంట్'అనే అంశంపై ఈ నెల 7న సాయంత్రం 4:30గంటలకు కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో ప్రసంగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ధ్యాన యోగం ప్రతినిధులు గురువారం కాచిగూడలో ఈ కార్యక్రమంపై ప్రచారాన్ని చేపట్టారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో మన జీవితాల్లో తలెత్తే అనేక ప్రశ్నలకు ఈ కార్యక్రమంలో పరిష్కారాలు దొరుకుతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తిగల వారు తమ పేర్లను ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు సూచించారు.

11 నుంచి ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ సమావేశాలు

కాచిగూడ: జర్నలిస్టుల ఉద్యమంలో 75 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు ఈనెల 11, 12, 13 తేదీలలో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరుగుతాయని ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆనందం, తెలంగాణ అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు. సూర్య నగరంగా ప్రసిద్ధిగాంచిన జోధ్‌పూర్ నగరంలో తొలిసారిగా జరుగుతున్న ఈ మూడు రోజుల జాతీయ సమావేశాలకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది ప్రతినిధులు హాజరవుతారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యలపై సమావేశాల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల రక్షణ చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ స్కీం, జర్నలిస్టుల వేజ్ బోర్డు, రద్దయిన రైల్వే రాయితీ పాసుల సమస్య, తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ జాతీయ సమావేశాలకు తెలంగాణ నుంచి దాదాపు 25 మంది ప్రతినిధులు ఈనెల 9న బయల్దేరనున్నట్లు తెలిపారు.

బ్రాహ్మణ పరిషత్‌కు నిధుల మంజూరుపై హర్షం

నల్లకుంట: విదేశీ విద్య, వివేకానంద విద్యానిధితో పాటు విదేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన బ్రాహ్మణ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయడంపై బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా పరిషత్ గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ, అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, గంగు నవీన్, వల్లూరి పవన్, రాష్ట్ర కన్వీనర్ తదితరులు నేడొక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిషత్‌కు మంజూరు చేసిన డబ్బులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

ఆదర్శప్రాయ నాయకుడు మండలి కృష్ణారావు

చిక్కడపల్లి: ప్రజల సేవ కోసమే పదవి అని భావించిన అరుదైన ఆదర్శప్రాయ నాయకుడు మండలి కృష్ణారావు అని ప్రముఖులు ప్రశంసించారు. కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ కమలాకర లలితకళా భారతి నిర్వహణలో మండలి కృష్ణారావు శత జయంతి నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలి కృష్ణారావు నాడు విద్యాశాఖ మంత్రిగా ప్రపంచ తొలి తెలుగు మహాసభలు నిర్వహించారన్నారు. తెలుగు భాషకు ఉన్న శక్తిని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ: దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ చౌరస్తాలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అశోక్‌నగర్ చౌరస్తాలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. దోమలగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తుపడితే దోమలగూడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గోల్నాకలో జరిగిన పూజలో ఎమ్మెల్యే సతీమణి కాలేరు పద్మ



చెప్పల్‌బజార్‌లో.. బీఆర్‌ఎస్ నేత రమేష్



కాచిగూడలో.. భజరంగ్ సేన అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు



గోల్నాకలో గణేశ్ వేడుకల్లో కార్పొరేటర్ లావణ్య



దోమలగూడలో సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో పూజలు



జైజై గణేశా.. జయములివ్వు బుజ్జిగణేశా..!

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కనులవందువగా జరుగుతున్నాయి. 9వ రోజు గురువారం మండపాల వద్ద అన్నదానాలు, లంబోధరుడికి ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొని మండపాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన గణపతిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో మండప నిర్వాహకులు నిమజ్జన ఊరేగింపునకు ముందు గణపతి లడ్డూ వేలం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో పూజలు అందుకుంటున్న గణపతి లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు డబ్బును సైతం లెక్క చేయకుండా పోటీపడ్డారు.
– కాచిగూడ



పూజలు పునస్కారాలు..





అడిక్‌మెట్‌లో.. రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ



వేలంలో రూ.45 వేలకు దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని సాయి దంపతులకు



గాంధీనగర్‌లో బీఆర్‌ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాసరావు



శాస్త్రీనగర్‌లో.. ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ

భక్తులకు అన్నదానాలు



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి



అశోక్‌నగర్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ రమేష్



భాగ్యనగర్‌లో..